క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వర్ధన్నపేట : ఆకేరు వాగు నుంచి వరంగల్‌కు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆకేరు వాగు నుంచి అక్రమంగా రవాణా, అదే విధంగా మట్టిని తోడి ఇసుక ఫిల్టర్ సైతం చేయొద్దన్నారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల తనిఖీ



ఖానాపురం : మండలంలోని కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఎంఈఓ రత్నమాల, ఎంపీపీ ప్రకాశ్‌రావు శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడం లేదని డీఈఓకు గ్రామానికి చెందిన పలువురు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన డీఈఓ ఎంఈఓను విచారణకు ఆదేశించగా, పాఠశాలకు వెళ్లి పనులను పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే పాఠశాలకు సమయానికి రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ మంగ్యా నాయక్, భూస అశోక్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం



నల్లబెల్లి : మండలంలోని అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన పులి అనసూర్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా మృతురాలి కుమారుడు రమేష్ చిన్ననాటి మిత్రులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.13వేలు నగదు అందజేశారు. మిత్రులు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్, కొండ్లే రమేష్, లకిడే శివాజీ తదితరులు ఉన్నారు.

అండగా బాల్యమిత్రులు

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన చింతకాయల రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా రాజు దశదినకర్మ శనివారం నిర్వహించగా వర్ధన్నపేట పాఠశాలకు చెందిన 2002వదో తరగతి బాల్యమిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.15వేల ఆర్థికసాయం అందజేశారు. కొండేటి బాలకృష్ణ, పి.అనిల్, ఎండి.యాకోబు, పాషా, శ్రీశైలం, వి.సుధాకర్, ఎండి.మౌలానా, జి.సాంబయ్య, బి.మహేందర్, బి.అశోక్, ఎ.సతీష్ ఉన్నారు.

చర్య తీసుకోవాలి



నర్సంపేట రూరల్ : అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. నర్సంపేట మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు శనివారం ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 116/1/60లో గల ప్రభుత్వ భూమిని కొంతమంది కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం యాకయ్య, బానోత్ వీరునాయక్, యాకుబ్, గడ్డం నాగరాజు, పిట్టల సతీష్, యాదగిరి, మమత, మంజుల, యశోద తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చెన్నారావుపేట : దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కుక్కల అశోక్ తన చిన్నమ్మ కుమారుడైన కుక్కల నవీన్‌కు భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కాగా శనివారం అశోక్ ఇదే గ్రామంలో ఒక కార్యక్రమానికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో నవీన్ రాడ్‌తో దాడి చేశాడు. దీంతో అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రికవరీ చేసేందుకు చర్యలు

రాయపర్తి : దొంగిలించిన మిషన్ భగీరథ పైప్‌లను రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష శనివారం తెలిపారు. 'సొంతానికి మిషన్ భగీరథ పైపులైన్' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఏఈ స్పందించారు. గ్రామంలో మిషన్‌భగీరథ పైపులను షెడ్డులో భద్రపర్చగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని విషయం తెలియగా పైపులను రికవరీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపనున్నట్లు చెప్పారు.

కేసీఆర్‌తోనే తండాల్లో అభివృద్ధి

ఘనంగా గిరిజన దినోత్సవం



ఖానాపురం: గిరిజనులను సన్మానిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

వర్ధన్నపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చంద్రుతండాలో తెలంగాణ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన తండాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. సర్పంచ్ మాలోత్ స్వరూప–వెంకన్న అధ్యక్షత వహించగా జెడ్పీటీసీ మార్గం భిక్షపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి 500 జనాభా కలిగిన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి స్వయం పరిపాలనకు మరింత ఊతమిచ్చారన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో జీవించే విధంగా వారిని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు తుమ్మల యాకయ్య, సిలువేరు కుమారస్వామి, ఎంపీటీసీ గుగులోత్ అనసూయమంగులాల్, రామవరం సర్పంచ్ కర్ర వెంకట్‌రెడ్డి, భూక్యా రాజేందర్ రాథోడ్, ఉప సర్పంచ్ భూక్యా నీలరవి, భూక్యా రామచంద్రు, తండా వాసులు పాల్గొన్నారు.

ఘనంగా భోగ్‌బండారో..

చెన్నారావుపేట : గిరిజన దినోత్సవం సందర్భంగా మండలంలోని పుల్లయ్యబోడు తండాలో సేవాలాల్ మహరాజ్ భోగ్‌బండారో కార్యక్రమాన్ని సర్పంచ్ బోడ సమ్మునాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మౌనిక, ఉప సర్పంచ్ గుగులోత్ హస్లీ, వార్డు సభ్యులు ఈర్య, గంగమ్మ, రవి, ఉమా, కవిత, కార్యదర్శి శ్రావణ్ తదితరులు ఉన్నారు.

దుగ్గొండిలో..



దుగ్గొండి: పీజీతండాలో..

దుగ్గొండి : మండలంలోని పీజీతండా, రాజ్యతండా, నారాయణతండా గ్రామాలలో తెలంగాణ గిరిజన దినోత్సవం సందర్భంగా సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన హోమగుండం వద్ద కర్రలు, రొట్టెలు, బెల్లం, నెయ్యితో భోగ్‌బండారో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మంగమ్మ, రవీందర్‌నాయక్, మధు, ఉప సర్పంచ్ అజ్మీరా రవీందర్, రాంధన్, శ్రీనుబాబు, రాజు, ధంజ్యా, వీరన్న తదితరుల పాల్గొన్నారు.

సాంప్రదాయాలకు నిలయం తెలంగాణ

ఖానాపురం : సంస్కృతీ, సాంప్రదాయాలకు నిలయంగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తోందని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గిరిజన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేపచెట్టుతండాలో గిరిజన దినోత్సవాన్ని నిర్వహించి భోగ్‌బండారో కార్యక్రమాన్ని చేపట్టారు. గిరిజన వేషాధారణలో ఆకట్టుకున్న గిరిజనులను, సీత్లాభవానీ పూజారులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, సర్పంచ్ పద్మావతి వెంకన్ననాయక్, జేపీఎస్ సుధాకర్, ఉప సర్పంచ్ దేవేందర్, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట: సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న గిరిజన నాయకులు



చెన్నారావుపేట: పూజలు చేస్తున్న సర్పంచ్

గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

పర్వతగిరి : తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడమే కాకుండా సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వమే నిర్వహిస్తుందని జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ దేశీరాం అన్నారు. ఈ మేరకు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చెరువుకొమ్ము తండాలో గిరిజన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్‌కు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం గిరిజనులకు సేవాలాల్ చిత్రపటాలను జిల్లా కో ఆప్షన్ సభ్యుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి, కార్యదర్శి రమాదేవి, బాలాజీ, ఇరుకు సర్దార్, రమేష్, దీప్లా, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్లు మంజూరు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్: నియోజకవర్గంలోని తండాలకు సీఎం కేసీఆర్ బీటీ రోడ్లు మంజూరు చేశారని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మతండా గ్రామపరిధిలో ఉన్న జంగాలపల్లి తండాలో శనివారం నిర్వహించిన గిరిజన దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రూ.90 లక్షలతో నిర్మించిన నూతన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజనులకు 6 నుంచి 10 శాతం రిజర్వేషన్లను సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెంచిందని తెలిపారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ ఈనెల 24న పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 9 సంవత్సరాల్లో అన్ని తండాలకు రూ.100 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. వేడుకల్లో ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఐటీడీఏ డీఈ, ఏఈ పాల్గొన్నారు.

'కేసులకు భయపడేది లేదు'

చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ నాయకులు పెట్టిన తప్పుడు కేసులకు భయపడేది లేదని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, అమీనాబాద్ సర్పంచ్ సిద్దన రమేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ జీవితమంతా దొంతి మాధవరెడ్డితోనే సాగుతుందన్నారు. తప్పుడు కేసులు పెడితే భయపడే వ్యక్తిని కాదన్నారు. ఎమ్మెల్యేను సన్మానిస్తే దానిని చిలువలు, పలువలు చేయాలని చూసిన వారి ఆశలు అడియాశలు అయ్యాయని విమర్శించారు.

ఇందిరమ్మ పాలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న దొంతి మాధవరెడ్డి

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నల్లబెల్లి : రాబోయే ఎన్నికల్లో ఇందిరమ్మ పాలన కోసం ప్రతి ఒక్కరూ సైనికుడిలాగా పని చేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేయి చేయి కలుపుదాం రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకుందామనే నినాదంతో మేడపల్లి, రాంపూర్ జంట గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి మాధవరెడ్డి శుక్రవారం రాత్రి యాత్ర చేపట్టారు. మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. నిరుద్యోగులు, మహిళలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలందరికీ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, కౌలు రైతులకు రూ.15 వేలు, భూమిలేని ఉపాధి కూలీలకు రూ.12 వేలు అందిస్తామన్నారు. రూ.500 లకే గ్యాస్ సిలింగర్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ప్రతి నెల రూ.4 వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని భరోసా కల్పించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్యాల తిరుపతి రెడ్డి, చార్ల శివారెడ్డి, వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, పెంతల కొంరారెడ్డి, మాలోత్ మోహన్, కడుదూరి కట్టయ్య, మాలోత్ అంజలి, చెల్పూరి జ్యోతి, పురుషోత్తం సురేష్, కుసుంబ రఘుపతి రావు, భూక్యా బావుసింగ్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి పాటుపడాలి



మాట్లాడుతున్న వేణుయాదవ్

నర్సంపేట : పార్టీలకతీతంగా యాదవ సంఘం బలోపేతానికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని మహబూబాబాద్ జిల్లా యాదవ సంఘం కోఆర్డినేటర్ కొమ్మనబోయిన వేణుయాదవ్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో యాదవ సంఘం సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. యాదవుల ఐక్యతతోనే అన్ని సాధించుకోవచ్చని, ఐక్యత చాటుతూ మనవంతు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఆర్థికంగా బలపడుతూ రాజకీయంగా ఎదగాలని, అందుకోసం ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. ఆబోతు రాజుయాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఆత్మగౌరవం కోసం అందరం ఒకే తాటిపైకి వచ్చి హక్కులను నెరవేర్చుకోవాలన్నారు. అనంతరం యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా దాసరిపల్లి యాదవ సంఘం పెద్ద గొల్ల తోటకూరి ఐలయ్యయాదవ్‌ను ఎన్నుకున్నారు. ఊడుగుల రాజు, దొంగల సురేష్, మేకల రాజు, లెంకల మల్లేషం, మేకల రాజేందర్, కుక్కల మల్లేష్ పాల్గొన్నారు.

బీసీ రుణాల దరఖాస్తుల గడువు పొడిగించాలి

వరంగల్: బీసీ రుణాల దరఖాస్తుల గడువును జూలై 20 వరకు పొడిగించాలని, బీసీలోని అన్ని కులాలకు ఈ పథకం వర్తింపజేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. బీసీ కులవృత్తిదారులు రూ.లక్ష ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వడం లేదని దాంతో బీసీలు ఆందోళనలకు గురవుతున్నారని వాపోయారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్ కార్యాలయాల చుట్టూ మండుటెండలోతిరుగుతూ పడుతున్న బాధలు వర్ణనాతీతమని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాకుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని, వారందరిని రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. .

'మోర్చా'లు క్రియాశీలకంగా పనిచేయాలి

- ప్రజలకు ప్రధాని మోదీ విధానాలను వివరించాలి
- జమ్మూకశ్మీర్ మాజీ ఉపముఖ్య మంత్రి నిర్మల్‌సింగ్



మాట్లాడుతున్న నిర్మల్‌సింగ్

గీసుకొండ: పార్టీ ప్రజల్లోకి వెళ్లడానికి 'మోర్చా'లు క్రియాశీలకంగా పనిచేయాలని జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పరకాల నియోజకవర్గస్థాయి బీజేపీ మహిళా, కిసాన్, దళిత, గిరిజన, ఓబీసీ మోర్చా కార్యకర్తల సంయుక్త సమ్మేళనం శనివారం నిర్వహించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు 6 నెలల సమయం ఉందని తెలిపారు. బూత్‌స్థాయి వరకు వెళ్లి ప్రజలకు ప్రధాని మోదీ సంక్షేమ పథకాలు, పాలన తీరును వివరించడంతోపాటు బీఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పార్టీ, మోర్చాల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పరకాల ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, జిల్లా అధికార ప్రతినిధి గట్టికొప్పుల రాంబాబు, కార్యాలయ కార్యదర్శి క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బండారి కల్యాణి, నాయకులు గోదాసి అశ్విని, అరకట్ల ప్రవీణ్, ఫిరంగి సంతోష్, గురుప్రసాద్, జయంత్‌లాల్, కుమారస్వామి, ముల్క ప్రసాద్, బొల్లం యుగేంధర్ పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి



సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే అరూరి రమేష్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మాల్యాతండాలో గిరిజన సంక్షేమ దినోత్సవం

పర్వతగిరి: గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాల్యాతండాలో శనివారం తెలంగాణ గిరిజన సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో కలిసి సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. స్వయం పాలనే ధ్యేయంగా తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల గృహావసరాల కోసం 101 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోందని, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రభుత్వం చేయూతనిస్తున్నదని తెలిపారు. గిరిజనుల కోసం గురుకులాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు గిరిజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా భరోసా కల్పిస్తోందన్నారు. వేడుకల్లో ఎంపీపీ లూనావత్ కమలాపంతులు, జెడ్పీటీసీ సింగ్‌లాల్, సర్పంచ్ బోడ సుజాత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

కాశిబుగ్గ: ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థినులకు బడిబాట కార్యక్రమంలో భాగంగా శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కెరీర్‌పై హెచ్ఎం కే.శ్రీధర్ అధ్యక్షతన శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ కోర్సుతో ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో వివరించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఆపద సమయంలో 1098, 100, 102, 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సృజన, సీపీఓ సరిత, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హౌస్ అరెస్టు అప్రజాస్వామికం



వర్ధన్నపేట: మాట్లాడుతున్న వెంకటయ్య



సంగెం: పోలీస్‌స్టేషన్‌లో మాధవరెడ్డి తదితరులు



దుగ్గొండి: పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



గీసుకొండ: పోలీసుల అదుపులో నాయకులు

వర్ధన్నపేట : మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణవరదరాజేశ్వర్‌రావును హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య విమర్శించారు. శనివారం వర్ధన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను అణచివేసేందుకు కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కుతూ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ హౌజ్ అరెస్టులు చేయడం ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వణుకు పుడుతుందన్నారు. నాయకులు ఎర్ర శ్రీకాంత్, చెరుపెల్లి బాబు, బంగారు సదానందం, శివరాత్రి వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

సంగెం : మంత్రి కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్‌లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం శనివారం ఉదయం చింతలపల్లి సర్పంచ్ ఇండ్ల రవికుమార్‌ను నర్సంపేట పోలీసులు అరెస్టు చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజు, పులి సాంబయ్యను సంగెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'అరెస్టులతో ప్రజాభిమానాన్ని ఆపలేరు'

ముందస్తు అరెస్టులతో ప్రజాభిమానాన్ని ఆపలేరని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కేశవులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.

దుగ్గొండిలో..

దుగ్గొండి : వరంగల్‌లో మంత్రి కేటీఆర్ సభ దృష్ట్యా పలువురు కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిగత పూచికత్తుపై సాయంత్రం వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హింగే రామారావు, అశోక్, రామచంద్రు ఉన్నారు.

పోలీసుల అదుపులో కాంగ్రెస్, బీజేపీ నాయకులు

గీసుకొండ : మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పోలీసులు కాంగ్రెస్, బీజేపీ నాయకులను శుక్రవారం రాత్రి ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. తుమ్మనపెల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ కాయిత భిక్షపతి, బీజేపీ నాయకులు అరకట్ల ప్రవీణ్, బూర్గుల యుగేందర్, గోదాసి అశ్వినిలను అదుపులోకి తీసుకుని శనివారం మధ్యాహ్నం విడుదల చేశారు. కాగా పోలీసులు అదుపులోకి తీసుకున్న ముగ్గురు బీజేపీ నాయకులను జమ్మూ కశ్మీర్ మాజీ ఉపముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్, బీజేపీ జిల్లా నాయకులు శాలువాలతో సన్మానించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



రాయపర్తి : రెండు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శనివారం పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఎస్సై బండారి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మచ్చ శ్రీనివాస్ తన మొబైల్‌ను రెండు నెలలక్రితం గుర్తు తెలియని ప్రదేశంలో పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో సీఈఐఆర్.జీఓవీ.ఇన్ పోర్టల్‌లో అప్లైచేసుకున్నాడు. ఈ క్రమంలో రెండు నెలలక్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను స్థానిక ఎస్సై బాధితుడికి అప్పగించారు. దీంతో సంతోషపడిన శ్రీనివాస్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.